

బహిరంగ ప్రదేశాల్లో పరిశుభ్రతకు చర్యలు : కమిషనర్

నెల్లూరు కార్పొరేషన్ బహిరంగ ప్రదేశాలలో వ్యర్థాలు వేస్తున్న బ్లాక్ స్పాట్స్ ను గుర్తించి, పరిశుభ్రం గా ఉంచాలని గ్రీన్ స్పాట్స్ గా మార్చాలని శానిటేషన్ విభాగం అధికారులు, వార్డు సచివాలయ ఎమినిటీస్ కార్యదర్శులను కమిషనర్ ఆదేశించారు. నగరపాలక సంస్థ పబ్లిక్ హెల్త్ విభాగం, వార్డ్ సచివాలయ శానిటేషన్ కార్యదర్శులతో కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో బుధవారం సమీక్ష నిర్వహించారు. బహిరంగ ప్రదేశాలలో చెత్తను వేసే వారిని గుర్తించి జరిమానాలు విధించాలని ఆదేశించారు. నిషేధిత ప్లాస్టిక్ ఉత్పత్తుల వినియోగాన్ని, విక్రయాన్ని అరికట్టాలని జరిమానాలు విధించాలని సూచించారు. సిల్ట్ తొలగించే పనులను ఈనెల చివర నాటికి పూర్తి చేయాలని కమిషనర్ ఆదేశించారు. నగరం మొత్తం చిన్న, పెద్ద డ్రైను కాలువల్లో జరుగుతున్న డిసిల్టేషన్ పనులను క్రమం తప్పకుండా చేపట్టాలని తెలిపారు. ఎస్.ఈ రామ్మోహన్ రావు, ఈ.ఈ రహంతు జానీ, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ చైతన్య, వెటర్నరీ వైద్యులు డాక్టర్ మదన్ మోహన్, మలేరియా విభాగం అధికారి జిజియా బాయి, సూపరింటెండెంట్ సులోచన పాల్గొన్నారు.

నెల్లూరు రూరల్ వైసిపిలో కుమ్ములాటలు..!

'ఆదాల' పార్టీ కార్యక్రమాలకు దూరం -'ఆనం' ఆధిపత్య ధోరణిపై అగ్రహం

ఇటీవల జరిగిన సాధారణ ఎన్నికల్లో చావు దెబ్బతగిలి చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడుతోన్న వైసిపిలో తమ్ముళ్ల కుమ్ములాట ఆపార్టీకి మరింత నష్టం చేకూర్చుతోంది. ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని పదికి పది స్థానాలు కోల్పోవడంతోపాటు నాయకులు, కార్యకర్తలు ఎక్కువ మంది అధికారపార్టీవైపు జరిగారు. ఉన్నంతలో పార్టీని కాపాడుకోవాల్సిన నాయకులు సిగపట్లు పడుతున్నారు. నువ్వెంతంటే నువ్వెంత అంటూ వివాదాలు సృష్టిస్తున్నారు.గత ఎన్నికల్లో పోటీచేసి, పార్టీకి సీనియర్ నాయకులుగా చెప్పుకునే ఆదాల ప్రభాకర్‌రెడ్డి ప్రస్తుతం ఆపార్టీ కార్యక్రమాలకు దూరమైపోయారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో ఎంఎల్‌ఎ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి వైసిపికి గట్టి దెబ్బ కొట్టారు. కార్పొరేషన్ పరిధిలోని, 18 పంచాయతీల్లోనూ వైసిపి నేతలు ఎక్కువ మందిని టిడిపి వైపు తిప్పుకున్నారు. పార్టీ ఇన్‌ఛార్జ్ ఆనం విజయకుమార్‌రెడ్డి ఆధిపత్య ధోరణిలు ఎక్కువైపోతున్నాయని, నాయకులను గుర్తించడంలేదని పార్టీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చావు బతుకుల మధ్య ఉన్న వైసిపి పరిస్థితి మరింత దారుణంగా తయారైంది.

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

ఒకప్పుడు నెల్లూరు జిల్లాలో వైసిపికి ఎదురే లేదు. రాష్ట్రంలో కడప తరువాత పార్టీ బలంగా ఉన్న జిల్లాగా పేరుంది. ఇటీవల ఎన్నికలకు ముందు వైసిపిలో ఉన్న నాయకులు ఆనం రామ నారాయణరెడ్డి, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి వంటి నాయకులు టిడిపి వైపు వచ్చారు. గత ఎన్నికల్లో జిల్లాలోని మొత్తం స్థానాలు టిడిపి కైవసం చేసుకుంది. అంతటితో ఆగకుండా వైసిపిని చావుదెబ్బతీసింది. జిల్లాలోని ఎనిమిది నియోజకవర్గాల్లో ప్రస్తుతం పార్టీ కార్యక్రమాలు , ఆందోళనలు నెల్లూరు సిటి, కోవూరు, సర్వేపల్లి ప్రాంతాల్లోనే బలంగా జరుగుతున్నాయి. వైసిపి అధిష్ఠానం వద్ద ఆదే రిపోర్టు ఉంది.నెల్లూరు రూరల్ ఎంఎల్‌ఎ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి నియోజకవర్గంలో వైసిపిని భారీగా దెబ్బతీశారు. తన రాజకీయ వ్యూహంతో వైసిపిలోని నాయకులు, కార్యకర్తలకు ఎక్కువ మందిని తనతోపాటు తీసుకెళ్లారు. ప్రజలతో నిత్యం తిరుగుతూ , వైసిపిని కోలుకోలేని దెబ్బకొడుతున్నారు. ఇలాంటి సమయంలో ఆ నియోజకవర్గంలో పార్టీని బలంగా తీర్చిదిద్దాలంటే నాయకత్వం బలంగా ఉండాలి. అందరూ ఉమ్మడిగా కలిసి ముందుకు సాగాలి. ఇప్పుడు నెల్లూరు రూరల్ వైసిపిలో ఆ పరిస్థితి కనిపించడం లేదు. 2024 ఎన్నికల్లో అక్కడ నుంచి సీనియర్ నాయకులు ఆదాల ప్రభాకర్‌రెడ్డి పోటీ చేశారు. అప్పటి వరకు ఆయనే నాయకత్వం వహించారు. పెద్ద ఎత్తున డబ్బు ఖర్చుచేసినా ఫలితం రాలేదు. ఎన్నికలు ముగిసిన తరువాత ఆదాల ప్రభాకర్‌రెడ్డి కొంత పార్టీకి దూరంగా ఉండటంతో వైసిపి అధిష్ఠానం ఆనం విజయకుమార్‌రెడ్డిని నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌గా నియమించారు. అప్పటి నుంచి ఆదాల ప్రభాకర్‌రెడ్డి, ఆయన అనుచరులకు ఆనం విజయకుమార్‌రెడ్డి కనీసం పట్టించుకోవడంలేదని ఆయన వర్గీయులు అంటున్నారు. ఇటీవల కాలంలో వైసిపి విద్యుత్ బిల్లులు, పీజు రియింబర్స్‌మెంట్ తదితర ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో ఈ కార్యక్రమాలు సరిగా జరగలేదు. కేవలం ఆనం విజయకుమార్‌రెడ్డి, తన అనుచరులతో వెళ్లి కార్యక్రమం జరిగిందని పించారు. ఇదే క్రమంలో ఆదాల ప్రభాకర్‌రెడ్డిని వైసిపి జిల్లా నాయకత్వం, నియోజకవర్గ నాయకులు పట్టించుకోవడం మానేశారు. దీంతో ఆదాల నెల్లూరు రావడం మానేశారు. ఎన్నికల తరువాత అనేక మంది నాయకులు మౌనంగా ఉంటున్నారు. ఎన్నికల ముగిసిన తరువాత సీనియర్ నాయకులు నల్లపురెడ్డి పెంచలరెడ్డి పార్టీ కార్యక్రమాలకు దూరంగాఉంటున్నారు. ఎన్నికలకు ముందు ఆయనను అధ్యక్షులుగా నియమించారు.ఆయన ఆ పదవిలో కొనసాగుతుండగా ఇటీవల కార్పొరేటర్ శ్రీనివాసయాదవ్‌కు నాయకత్వ బాధ్యతలు అప్పగించారు. ఈ విషయమై ఇటీవల నల్లపురెడ్డి పెంచలరెడ్డి మీడియా సమావేశం ఏర్పాటు చేసి ఆనం విజయకుమార్‌రెడ్డిపై తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. తరువాత రోజు ఆనం విజయకుమార్‌రెడ్డి అనుచరులు మీడియా సమావేశం ఏర్పాటు చేసి విమర్శలు చేశారు. రూరల్‌లో పార్టీ పరిస్థితి అంతంత మాత్రంగా ఉన్నవేళ అందరూ కలిసి పనిచేయాల్సింది పోయి కుమ్ములాటలు పెట్టుకోవడంతో నాయకులు, కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పార్టీ జిల్లా అధ్యక్షులు కాకాణి గోవర్ధన్‌రెడ్డి కేసుల్లో సతమతమౌతున్నారు. పార్టీకి ఇక్కడ పెద్ద దిక్కు లేకుండా పోయింది. మరో నాలుగు సంవత్సరాలు పార్టీని కాపాడుకోవాల్సిఉంటుంది. ఇలాంటి సమయంలో నెల్లూరు రూరల్ నాయకులు సిగపట్లు పట్టుకోవడంతో ఉన్న కొద్ది మంది కార్యకర్తలు, నాయకులు వెళ్లిపోతారనే ప్రచారం సాగుతోంది. నియోజకవర్గంలో ఆపార్టీ పరిస్థితి దయనీయంగా మారుతోంది.

కాకాణికి మళ్లీ రిమాండ్ పొడగింపు

నెల్లూరు కోర్టుకు హాజరు

ప్రజాశక్తి -నెల్లూరు ప్రతినిధి

అక్రమ మైనింగ్ కేసులో రిమాండ్‌లో ఉన్న మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డికి మరో రిమాండ్ విధించారు. పొదలకూరు రుస్తుం మైనింగ్ అక్రమ కేసులు, ఎస్‌సి,ఎస్‌టి కేసులో ఆయన ప్రస్తుతం నెల్లూరు జిల్లా జైల్లో రిమాండ్‌లో ఉన్నారు. ఇటీవల సర్వేపల్లి ఎంఎల్‌ఎ సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి కేసుకు సంబంధించి గుంటూరు కోర్టు పీటి వారెంట్ వేసింది. ఆ కేసులోనూ ఆయన ప్రస్తుతం రిమాండ్‌లో ఉన్నారు. తాజాగా బుధవారం నగరంలోని 5వ అదనపు జిల్లా మేజిస్ట్రేట్ కోర్టుకు హాజరయ్యారు. జైలు నుంచి భద్రత నడుమ ఆయనను కోర్టుకు హాజరుపరిచారు. కాకాణి చిరునవ్వులు చిందిస్తూ కోర్టు వద్దకువచ్చారు. తన అనుచరులు, ముఖ్యనాయకులకు అభివాదం చేస్తూ కనిపించారు. కాకాణి బెయిల్ పిటిషన్ పై జిల్లా కోర్టు లో వాదనలు ముగిశాయి. తీర్పును ఈ నెల 20కి ఎస్‌సి, ఎస్‌టి కోర్టు న్యాయమూర్తి సరస్వతి వాయిదా వేశారు. 2021 మాగుంట శ్రీనివాసులురెడ్డి సంతకం ఫోర్జరీతో కనుమూరు, కసుమూరు గ్రామాల్లో అక్రమంగా గ్రావెల్ తరలించారని, అప్పట్లో ఇరిగేషన్ అధికారులు కేసు పెట్టారు. ఈ విషయమై రాష్ట్ర ప్రభుత్వం సిట్ వేసింది. బాపట్ల పోలీసులు ఈ కేసు నమోదుచేశారు. ఈ కేసులో ఏ2గా ఉన్న కాకాణి గోవర్ధన్‌రెడ్డిని పోలీసు కస్టడీకి ఇవ్వాలని బాపట్ల పోలీసులు తరఫున న్యాయవాది వాదించారు. దీనిని న్యాయమూర్తి నిరాకరించారు. ఈ కేసుకు సంబంధించి మరో 14 రోజులు రిమాండ్ విధించారు. ఇవి కాకుండా మరో రెండు కేసులు సిద్ధం చేసినట్లు తెలిసింది. ఒక కేసు తరువాత మరో కేసుతో ప్రభుత్వం కాకాణిని ఇప్పట్లో బయటకు రానిచ్చేలా కనిపించడం లేదు. కాకాణి బెయిల్ పిటిషన్‌పై 20న తీర్పు రానున్న మరో రెండు కేసుల్లో ఆయన రిమాండ్‌లో ఉన్నారు

ప్రయివేటు గుప్పిట్లోకి ప్రభుత్వ వైద్య రంగం

ప్రజారోగ్య వేదిక విమర్శ

ప్రజాశక్తి -నెల్లూరు

ప్రభుత్వ వైద్యరంగాన్ని నిర్వీర్యం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం పావులు కదుపుతోందని ప్రజా ఆరోగ్య వేదిక రాష్ట్ర కమిటీ నాయకులు విమర్శించారు. ప్రభుత్వ వైద్యం ంగాన్ని ప్రయివైటు గుప్పిట్లో పెడుతుందన్నారు. మంగళవారం నగరంలోని జెట్టి శేషారెడ్డి విజ్ఞాన భవన్లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వేదిక రాష్ట్ర నాయకులు డాక్టర్ ఎం వి రమణయ్య మాట్లాడారు. ప్రభుత్వం నూతన నంగా ప్రారంభించబోతున్న ప్రభుత్వ వైద్య కళాశాలలను, వీటికి అనుబంధంగా ఏర్పడ బోయే ఆసుపత్రులను ప్రయివేటు సంస్థల ఆధీనంలోకి తీసుకుపోవాలని ఇప్పటి ప్రభుత్వం నిర్ణయిం చిందన్నారు.గత ప్రభుత్వం తీసుకువచ్చిన సెల్ఫ్ ఫైనాన్స్ విధానం మీద విమర్శలు గుప్పిస్తూనే అదే విధానాన్ని అమలుకు పూనుకొని ప్రభుత్వ ఆరోగ్య వ్యవస్థను

మాట్లాడుతున్న ప్రజారోగ్య వేదిక నాయకులు

ప్రైవేట్ శక్తుల చేతుల్లో పెట్టబోతున్నారపాకపనేజ పస్తుత ప్రభుత్వం గత ప్రభుత్వా న్ని విమర్శిస్తున్నది. గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే కూటమి ప్రభుత్వం పీ.పీ.పీ విధానాన్ని వైద్య రంగంలో అమ లుకు పూనుకుందని చెబుతూనే ఈ పీ పీ పీ విధానం ఎంతో గొప్పదని, ఈ విధానం ప్రజలకు ఎంతో మేలు చేస్తోందని ప్రస్తుత ప్రభుత్వం ప్రచారం చేస్తుందన్నారు. .ఈ నేపథ్యంలో ఆ ప్రమాదకర విధానాన్ని వెనక్కి కొట్టటమే రాష్ట్ర ప్రజల ముందున్న కర్తవ్యం ఈ సమావేశం లో ప్రజారోగ్య వేదిక నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాలన బీసీలకు స్వర్ణయుగం

ప్రజాశక్తి నెల్లూరుప్రతినిధి : కూటమి ప్రభుత్వం తమ ఏడాది పాలనలో బిసిలకు స్వర్ణయుగంలా ఉందని ఇన్‌ల్యాండ్ వాటర్ వేస్ అథారిటీ ఛైర్మన్ డాక్టర్ జెడ్ శివ ప్రసాద్ అన్నారు. బుధవారం టిడిపి కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వం ఏర్పాటైన తొలిరోజుల్లోనే పెన్షన్లు పెంపు, తల్లికి వందనం పథకాల లబ్ధిదారులలో బిసిలే అగ్రబాగాన ఉన్నారన్నారు. ప్రభుత్వం ప్రకటించిన నిధులు, నామినేటెడ్ పదవులు, చట్ట సభలు, స్థానిక సంస్థలు.... రంగం ఏదైనా కూటమి ప్రభుత్వం లో బీసీలదే అగ్ర తాంబూలం ఇచ్చారన్నారు. శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, పార్టీ అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, రాష్ట్ర కేబినెట్ లోని 8 మంది మంత్రులు, 38 మంది శాసన సభ్యులు బిసిలున్నారన్నారు.

మాట్లాడుతున్న జెడ్ శివప్రసాద్

అన్న క్యాంటీన్‌లో పరిశీలన

ప్రజాశక్తి-కందుకూరు : కందుకూరు అన్న క్యాంటీన్‌ను మున్సిపల్ కమిషనర్ కె అనుష బుధవారం పరిశీలించారు.మున్సిపల్ కమిషనర్ కె అనూష గారు ఆహార పదార్థాలను రుచి చూశారు. అల్పాహార విందును చేశారు. క్యాంటీన్ పరిసర ప్రాంతాలను పరిశీలించి సంతప్తి వ్యక్తం చేశారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - వలేటివారిపాలెం : గేదెలకు వ్యాపించే వ్యాధుల పట్ల పశుపోషకులు అప్రమత్తంగా ఉండాలని పశుసంవర్ధక శాఖ వలేటివారిపాలెం అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎంతోటి చెన్నకేశవులు సూచించారు. వివి పాలెం లో ఇటీవల నూతన ఎడిగా బాధ్యతలు చేపట్టిన ఆయన బుధవారం తనను కలిసిన విలేకరులతో మాట్లాడారు. ప్రధానంగా ప్రస్తుత సీజన్ లో గేదెలకు గుదిపెట్టు వ్యాధి వ్యాప్తి చెందే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో హెచ్ఎస్ వ్యాక్సిన్ ను మండలంలోని అన్ని గ్రామాలకు పంపినట్లు తెలిపారు. గేదెలకు ఈ గొంతు వాపు వ్యాధి వల్ల కళ్ళు ఎర్రగా మారడం, ముక్కు, కళ్ళ నుండి నీరు గారి సకాలంలో వైద్యం అందని పక్షంలో 24 గంటల్లోనే సదరు గేదెలు చనిపోయే ప్రమాదం ఉందన్నారు. ఎద పడ్డలకు కూడా బ్యాక్టీరియా ఆశిస్తుందని, పశుపోషకులు కచ్చితంగా వాక్సిన్ ను గేదెలకు వేయాలని తెలిపారు.

ఎ. చెన్నకేశవులు, ఎడి

పారిశుధ్య పనులు పర్యవేక్షణ

ప్రజాశక్తి -కార్పొరేషన్

అన్ని వార్డుల్లో డోర్ టు డోర్ చెత్త సేకరణపై నెల్లూరు నగరపాలక సంస్థ ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ చైతన్య పర్యవేక్షించారు. పారిశుధ్య పనుల పర్యవేక్షణలో భాగంగా 13/2 సచివాలయం మస్టర్‌కు హాజరై పారిశుధ్య కార్మికుల అటెండెన్స్ ను పరిశీలించారు. చెత్తను చెత్త వాహనాలకు మాత్రమే ఇవ్వాలని, రోడ్డుపై వేయ కుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు.రోడ్డు పక్కన చెత్త వేసే వారికి పెనాల్టీస్ వేయవలసిందిగా ఆదేశించారు.

అనుమతుల్లేని భవన నిర్మాణాలు సీజ్

ప్రజాశక్తి - నెల్లూరు కార్పొరేషన్

నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ విభాగం అనుమతులను మీరి నిర్మించిన అక్రమ భవన నిర్మాణాలను సీజ్ చేసి యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని నగర కమిషనర్ నందన్ హెచ్చరించారు. నగరంలోని జేమ్స్ గార్డెన్ ప్రాంతంలో అనుమతులను అతిక్రమించి నిర్మించిన రెండు భవనాలను సీజ్ చేశామని కమిషనర్ ఒక ప్రకటన ద్వారా తెలిపారు. నోటీసులకు స్పందించని యజమానులకు కోర్టు సమన్లు అందజేశామని, చార్జిషీట్లు దాఖలు చేశామన్నారు.

ప్రజా సమస్యలకు సత్వర పరిష్కారం

ప్రజాశక్తి - లింగసముద్రం : ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని కందుకూరు సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీ పూజ ఆదేశించారు బుధవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో జరిగిన ప్రత్యేక ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ఐవిఆర్ఎస్ సర్వే ద్వారా మండలంలోని ప్రజలు ఇచ్చే అర్జీలపై ఇటీవల సర్వే నిర్వహించిందని అందులో మండలానికి సంబంధించి అధికారులు పనితీరు బాగా వెనకబడి ఉందని అసంతప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో తహశీల్దార్ సీత మహాలక్ష్మి ,ఎంపీడీవో కే. శ్రీనివాసులు ఎస్ఐ ఎం. నారాయణ ఆర్ఐ ఎం. రమణయ్య వీఆర్వోలు సర్వేలు సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర కల్చరల్ అధికార ప్రతినిధిగా 'వల్లూరి'

ప్రజాశక్తి-కందుకూరు

రాష్ట్ర కల్చరల్ అధికార ప్రతినిధిగా డాక్టర్ వల్లూరి కోటేశ్వరరావుని నియమించారు. వైసిపి ఆవిర్భావం నుంచి పార్టీ గెలుపు కోసం కృషి చేస్తూ ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తూ గతంలో బిసి సెల్ కార్యదర్శిగా కోటేశ్వరరావు పనిచేశారు .నాయి బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఉన్న తన మీద నమ్మకంతో పదవి ఇచ్చిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికి, మాజీ ఎమ్మెల్యే బుర్రా మధు మధుసూదన్ యాదవ్‌కిగారికి కతజ్ఞతలు వల్లూరి కోటేశ్వరరావు ధన్యవాదాలు తెలిపారు.

వల్లూరి కోటేశ్వరరావు

యోగా నిర్వహణపై సమీక్ష

ప్రజాశక్తి-కందుకూరు : విశాఖలో ఈనెల 21న 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహణ సందర్భంగా యోగాంధ్ర కార్యక్రమం ఏర్పాట్లపై బుధవారం శంగవరపుకోట నియోజకవర్గం లోని లక్కవరపుకోట మండలంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి ఎస్ సవిత తో కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు. శంగారపు కోట ఎం ఎల్ఎ కోళ్ల లలిత కుమారి ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ అధికారుల పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి -నెల్లూరు

మున్సిపల్ కార్మికులకు 'తల్లిక వందనం'తోపాటు వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నింటినీ అమలు చేయాలని కోరుతూ నగర పాలక సంస్థ కార్యాలయం ఎదుట ఎపి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా కార్యదర్శి కె పెంచల నర్సయ్య, సిఐటి యు రూరల్ అధ్యక్షులు కొండా ప్రసాద్ మాట్లాడారు. మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. 14. 6. 2025 న రాష్ట్ర ప్రభుత్వం జిఒ నెంబర్ 26 జారీ చేసినా, తల్లికి వందనం పథకం అమలు కాలేదన్నారు. 16 వ తేదీన కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ వారు అందరూ మున్సిపల్ కమిషనర్లకు పారిశుద్ధ్య కార్మికులకు తల్లికి వందనం అమలు చేయాలని ఉత్తర్వులు జారీ చేసినా ఫలితం లేదన్నారు. మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులకు వేతనాలు పెంచాలని, వీరికి కూడా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు సుజాతమ్మ, వజ్రమ్మ, లక్ష్మీ, చెన్నయ్య, బుజ్జమ్మ, సామ్రాజ్యం తదితరులు పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు

ఆన్సర్ షీట్స్ ట్యాంపరింగ్‌పై విజిలెన్స్ విచారణ చేపట్టాలి

'వివేకా' యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి - గాయత్రీ విద్యాసంస్థల ఛైర్మన్ రామకృష్ణ డిమాండ్

ప్రజాశక్తి-కందుకూరు

కందుకూరులో ఇంటర్ ఆన్సర్ షీట్స్ టాంపరింగ్ వ్యవహారంపై విజిలెన్స్ విచారణ చేపట్టాలని శ్రీ గాయత్రి కాలేజ్ యాజమాన్యం డిమాండ్ చేసింది. బుధవారం కళాశాలలో శ్రీ గాయత్రీ విద్యాసంస్థల ఛైర్మన్ సిహెచ్ రామకష్ణరావు ,డైరెక్టర్ భరద్వాజ్ తో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. తమ కళాశాల కు చెందిన మెరిట్ విద్యార్థులను దెబ్బతీసేందుకు శ్రీ వివేక జూనియర్ కళాశాల యాజమాన్యం దుర్మార్గమైన కుటిల యత్నాలు చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంటర్మీడియట్ బోర్డు చరిత్రలో కని విని ఎరుగని స్కామ్ కు శ్రీ వివేక జూనియర్ కళాశాల మేనేజ్మెంట్ తెగబడిందని ఆరోపించారు. గత మార్చి నెలలో శ్రీ వివేక కళాశాల సెంటర్లో జరిగిన ఇంటర్ పరీక్షల్లో గాయత్రీ కళాశాల విద్యార్థులు అవినాష్ బాబు, సాయి తేజస్విని ల ఆన్సర్ షీట్స్ ను టాంపర్ చేశారని.. దానిని ధవీకరించుకున్న ఇంటర్ బోర్డు సెక్రటరీ నష్టపోయిన మార్కులను కలిపి విద్యార్థులకు న్యాయం చేశారని కొనియాడారు. టాంపరింగ్ కు పాల్పడిన కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవడానికి రాష్ట్రస్థాయి అధికారులతో విచారణ జరపాలన్నారు. సమాజంలో జరిగే అన్యాయాలను అక్రమాలను వెలుగులోకి తెచ్చే సామాజిక బాధ్యత పత్రికలపై ఉందని దానిని ప్రశ్నించడానికి శ్రీ వివేక కాలేజ్ మేనేజ్మెంట్ కి ఏమి హక్కు ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

మాట్లాడుతున్న రామకృష్ణ

అమరవీరులకు ఘన నివాళి

ప్రజాశక్తి-నెల్లూరు

గోను చలపతి, మేకల చెంచయ్యల 27వ వర్ధంతి సందర్భంగా 20వ డివిజన్ నక్కలగుంట ప్రాంతంలోని వారి స్తూపం వద్ద రూరల్ డివైఎఫ్ ఐ, సిపిఎం, సిఐటియు నాయకులు కార్యకర్తలు ఘన నివాళులు అర్పించారు. బుధవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పెంచల. నరసయ్య, సిపిఎం రూరల్ కార్యదర్శి కొండా. ప్రసాద్ మాట్లాడారు. గోను చలపతి, మేకలు చెంచయ్య డివైఎఫ్ఐ జిల్లా నాయకులుగా అనునిత్యం యువత సమస్యలపై నిరంతరం పని చేస్తూ రూరల్ ప్రాంతంలోయువజన ఉద్యమాన్ని నిర్మించిన నాయకులన్నారు. స్థానికంగా ప్రతి ప్రాంతంలో కేరళ తరహాలో స్థానిక డివైఎఫ్ ఐ కమిటీలను ఏర్పాటు చేసి నిరంతరం ప్రజా సమస్యలపై యువతి యువకులను కదిలించి సమస్యల పరిష్కా రానికి కృషి చేశారన్నారు. పజల మన్ననలు పొందుతున్న సందర్భంలో మతోన్మాద బిజెపి ముష్క రులు రౌడీమూకలను ఉసుగొల్పి హత్య చేశారన్నారు. ప్రజామద్దతు ఉన్న నేతలను హత్య చేసినంత మాత్రాన, ప్రజల నుండి సిపిఎంను దూరం చేయలేరన్నారు. రాజకీయ హత్యలను మానుకోవాలని హితవు పలికారు. గోను చలపతి, మేకల చెంచయ్యల ఆశయ సాధన కోసం నిరంతరం పని చేస్తేనే వారికి నిజమైన నివాళులు అర్పించినట్లు అని వారు పేర్కొన్నారు. సిపిఎం సీనియర్ నాయకులు వీర్ల .శ్రీనివాసులు , సిపిఎం రూరల్ కమిటీ సభ్యులు పోతురాజు. శ్రీనివాసులు, షాహినా బేగం, శంషాద్ బేగం, ఒంగోలు. సుధీర్, కేవీపీఎస్ జిల్లా అధ్యక్షులు ఎన్. రఘురామయ్య , పార్టీ శాఖ కార్యదర్శులు నలగొండ్ల .రమణయ్య, సిహెచ్ రత్నం,. ఏ.శ్రీనివాసులు ఉన్నారు.

గోను చలపతి, మేకల చెంచయ్యల స్తూపం వద్ద నివాళి అర్పిస్తున్న నాయకులు

వ్యభిచార గృహంపై దాడి

నలుగురు అరెస్టు

ప్రజాశక్తి-కందుకూరు : పట్టణంలోని జనార్ధన్ కాలనీలోని మండల ప్రజా పరిషత్ పాఠశాల ప్రాంతంలో ఉన్న ఒ వ్యభిచార గహంపై కందుకూరు పట్టణ పోలీసులు బుధవారం దాడి చేశారు..సమాచారం తెలుసుకున్న పట్టణ ఎస్సై శివ నాగరాజు తన సిబ్బందితో వ్యభిచార గహంపై దాడి చేయగా ముగ్గురు మహిళలతో పాటు ఒక విటుడిని ని అదుపులోకి తీసుకున్నారు. ముగ్గురు మహిళలతోపాటు విటుడిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్ఐ శివ నాగరాజు తెలిపారు. ఈ వ్యభిచార గహాన్ని టిడిపికి చెందిన చోటా నాయకుడు ఒకరు నిర్వహిస్తున్నట్లు తెలిసింది. తొలుత సమాచారం అందుకున్న రూరల్ పోలీసులు వ్యభిచార గహం వద్దకు వెళ్లిన సమయంలో ముగ్గురు మహిళల తో పాటు ముగ్గురం పురుషులు ఉన్నట్లు సమాచారం. అయితే పట్టణ పోలీసులు మాత్రం ఒక విటుడు, ముగ్గురు మహిళలు మాత్రమే ఉన్నారని చెబుతున్నారు. మిగిలిన ఇద్దరు అక్కడి నుండి వెళ్లిపోయారా? పోలీసులు తప్పించారా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

మాట్లాడుతున్న భ.ని.కా జిల్లా కార్యదర్శి అల్లాడి గోపాల్

భవన సంక్షేమ బోర్డుకు నిధులు కేటాయించాలి

ప్రజాశక్తి-కోవూరు

భవననిర్మాణ కార్మిక సంఘం (సిఐటియు) కోవూరు జనరల్ బాడీ సమావేశం స్థానిక సిపిఎం కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా భ.ని.కా. జిల్లా కార్యదర్శి అల్లాడి గోపాల్ హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ భవనిర్మాణ కార్మికులు అనేక సమస్యలతో బాధపడుతున్నారన్నారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ కోసం ఏర్పాటు చేసిన సంక్షేమ బోర్డులో నిధులు లేకపోవడంతో ప్రమాదాలు జరిగిన కార్మికులకు ప్రమాద బీమా నిధులు మంజూరు కావడం లేదన్నారు. భవనిర్మాణ కార్మికుల సమస్యలపై సంఘటితమై పోరాటం చేయాలన్నారు. భవన నిర్మాణ సంక్షేమ బోర్డుకు నిధులు కేటాయించాలని జూలై 9వ తేదీన జరిగే సార్వత్రిక సమ్మెలో భవన నిర్మాణ కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలన్నారు. సమావేశంలో నూతన కమిటీ గౌరవాధ్యక్షులు ఎస్‌కె ఎజ్దానీబాషా, అధ్యక్షులు పెరుమాళ్ల హరి, కార్యదర్శిగా ఎస్‌కె అప్రోజ్, అహ్మద్ కమిటీ సభ్యులు. యు.శ్రీనివాసులు .కె శ్రీకాంత్, ఎస్‌కె నజీర్ బాషా, డి.జనార్ధన్ . నారాయణ రెడ్డి .మాబాషా, ఛాన్ బాషా, రఫీ, కృష్ణయ్య, .వెంకట రమణ య్య సురేష్ రెడ్డి 13మందితో నూతన కమిటీ ఏర్పాటు చేశారు.

బాలికలకు సైకిళ్లు పంపిణీ

ప్రజాశక్తి-కందుకూరు : కందుకూరు లో ఎంఇఒ ఆఫీస్ వద్ద వరల్డ్ విజన్ ఇండియా ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఎవరైతే స్కూల్ కి వెళ్ళడానికి బస్ సౌకర్యం లేక నడిచి వెళ్లి చదువుకునే బాలికలకు బుధవారం 17 సైకిళ్లు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా కందుకూరు మునిసిపల్ కమిషనర్ కె అనూష , డిప్యూటి డి ఇ ఓ నరసిం హం, కందుకూరు ఎంఇఓ సుబ్బారావు రెడ్డి పాల్గొన్నారు. కమిషనర్ అనూష మాట్లాడుతూ చదువుకునే పిల్లలకు వారి సౌకర్యార్థం వరల్డ్ విజన్ సంస్థ వారు సైకిళ్ళు పంపిణీ చేయడం హర్షించ దగ్గ విషయమన్నారు. ఈ సంస్థ కల్పించే ప్రతి మంచి అవకాశాన్ని విద్యార్థులు అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. డిప్యూటీ డిఇఓ పి ఏ నరసింహ ,.ఎంఇఒ సుబ్బారెడ్డి మాట్లాడారు. లో వరల్డ్ విజన్ మేనేజర్ కె యేషయ, ప్రోగ్రాం కో ఆర్డినేటర్ వై .పుల్లయ్య ఉన్నారు.

ఓగూరులో 'పొలం పిలుస్తోంది'...

కందుకూరు కందుకూరు మండల వ్యవసాయ అధికారి షేక్. అబ్దుల్ రహీం ఆధ్వర్యంలో ఓగూరు గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం బుధవారం నిర్వహిం చారు. ఎడిఎ పి. అనసూయ సహయ పాల్గొని 5 మంది రైతులు కలిసి ఒక గ్రూప్ గా ఏర్పడి 80 శాతం రాయితీ పై డ్రోన్ పొందవచ్చని, రైతులు ఈ అవకాశాన్ని వినియో గించుకోవాలని కోరారు.మండల వ్యవసాయాధికారి షేక్. అబ్దుల్ రహీం మాట్లాడుతూ, అన్నదాత సుఖీభవ పి యం కిసాన్ ఈ కెవైసీ ఎక్కడైనా చేయించు కోవచ్చునని తెలిపారు. రైతులు వ్యవసాయ పనిముట్లు కావలసిన వారు సమీప రైతు సేవ కేంద్రాలను సంప్రదించాలన్నారు. వి ఎఎ శరత్, గ్రామ నాయకులు అల్లం రాధయ్య, పచ్చ తిరువతి స్వామి,రైతులు పాల్గొన్నారు.

మహిళలు, చిన్న పిల్లలకు రక్షణ కరువు

ప్రజాశక్తి-నెల్లూరు అర్బన్ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం శాంతి భద్రతలను కాపాడడంలో ముఖ్యంగా మహిళలకు, చిన్నపిల్లలకు భద్రత కల్పించడంలో ఘోరంగా విఫలమైందని వైసిపి జిల్లా మహిళా అధ్యక్షురాలు శ్రీమతి లక్ష్మీ సునంద ఆరోపించారు. బుధవారం జిల్లా వైఎస్ఆర్సిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతిరోజు ఏదో ఒకచోట మహిళలపై అఘాయిత్యాలు జరుగుతున్నాయని అందులో భాగంగానే స్వయాన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సొంత నియోజకవర్గమైనటువంటి కుప్పం నియోజకవర్లో శిరీష అనే మహిళపై జరిగిన సంఘటనతో కూటమి ప్రభుత్వం సిగ్గుతో తలదించుకోవాలన్నారు.

డాక్టరేట్ ప్రదాతకు సన్మానం

ప్రజాశక్తి-ఉదయగిరి : సబ్ ట్రెజరీ కార్యాలయంలో అకౌంటెంట్‌గా విధులు నిర్వహిస్తున్న పికిలం వెంకటకిషోర్‌కు ఎవిటిఒ యిస్మాన్ సంస్థలతో మండల జన విజ్ఞాన వేదిక, పెన్షనర్స్ సంఘ నాయకులు సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఉదయగిరి జిల్లా ప్రధాన కార్యదర్శి దస్తగిరి అహ్మద్ మాట్లాడుతూ కిషోర్ స్వచ్ఛంద సేవ కార్యక్రమాలు రక్తదాన కార్యక్రమాలు నిర్వహించి కరోనాలో పేదలకు ఆహారం కూరగాయలు వారికి సహాయం చేసినందుకు అమెరికన్ విస్డం ప్రీస్ యూనివర్సిటీ వారు డాక్టరేట్ ప్రదానం చేసిన సందర్భంగా వారికి ఈ సన్మానం చేయడం జరిగిందన్నారు. ఉద్యోగ రీత్యా ప్రజలకు అందుబాటులో ఉంటూ కార్యాలయంలో ప్రజలకు సేవ చేస్తూ మరింతగా పేద ప్రజలను ఆదుకుంటూ వారికి అండగా నిలుస్తున్న కిషోర్ మరెన్నో సేవా కార్యక్రమాలు చేస్తూ అత్యున్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. మండల జెవివి నాయకులు గాజులపల్లి రామిరెడ్డి పెన్షనర్లు షేక్ జాఫర్ అహ్మద్ షేక్ మహమ్మద్ గౌస్ ఉపాధ్యాయులు షేక్ ఫయాజ్ పాల్గొన్నారు.

విద్యతోనే ఉన్నత స్థాయి

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం : ఉన్నత స్థితి నుండి ఉన్నత స్థాయికి చేర్చేది విద్య మాత్రమేనని తహశీల్దార్ ఎ.వెంకటేశ్వర్లు అన్నారు. బుచ్చిరెడ్డిపాలెం నగర పంచాయతీ రామచంద్రాపురం ప్రాథమికోన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులకు విద్యాసామగ్రి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తహశీల్దార్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన వసతి గృహాలకు సౌకర్యాలు సమకూరుస్తున్న దాత దొడ్ల కోదండరామిరెడ్డి, తిరుపతికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ చరణ్ రెడ్డిలను ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం దాత దొడ్ల కోదండరామిరెడ్డి మాట్లాడారు. దొడ్ల కోదండరామిరెడ్డి తహశీల్దార్, ఎంఇఒ వెంకటరత్నం పాఠశాల ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. గత 27 సంవత్సరాలుగా తను పనిచేస్తున్న పాఠశాలలో విద్యార్థులకు విద్యాసామగ్రిని పంపిణీ చేయిస్తున్న ఉపాధ్యాయులు, సామాజికవేత్త గండికోట సుధీర్ కుమార్ ను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.వేదవతి, పి.నిర్మల, 20వ వార్డ్ కౌన్సిలర్ చలంచర్ల శ్రీదేవి, ఎస్సీ కార్పొరేషన్ రాష్ట్ర నాయకులు చలంచర్ల సునీల్, ఉపాధ్యాయులు అరుణకుమారి, మున్వర్ అహ్మద్, బ్రహ్మారెడ్డి, రసూల్, ఉపాధ్యాయినిపెపిసా బేగం, సుమన్ పాల్గొన్నారు.

'యోగాంధ్ర' నిర్వహణకు అధికారుల నియామకం

ప్రజాశక్తి-ఎంఎస్‌పేట : యోగా దినోత్సవం పురస్కరించుకొని, 21వ తేదీ శనివారం నిర్వహించే కార్యక్రమానికి సంబంధించిన కలెక్టర్ వారి టెలీ కాన్ఫరెన్స్ ఆదేశాల మేరకు, 13 గ్రామ సచివాలయాల పరిధిలో ఎంపికైన ప్రదేశాలలో యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించడానికి ప్రత్యేక అధికారులను నియమించారని ఎంపిడిఒ ప్రసన్నకుమారి తెలిపారు. ఈ మేరకు బుధవారం ఎంపిడిఒ పి.ప్రసన్నకుమారి ప్రత్యేక విలేకరుల సమావేశం నిర్వహించి తెలియజేశారు.

ముమ్మరంగా చెరువుకట్ట అభివృద్ధి పనులు

ప్రజాశక్తి-సంగం : మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి చొరవతో మండలంలోని తలుపురుపాడు చెరువు కట్ట అభివృద్ధి ముమ్మరంగా జరుగుతున్నాయనిసంగం సొసైటీ మాజీ సంఘ అధ్యక్షులు షేక్ బాబు తెలిపారు. ఎన్నోయేళ్లుగా ఈ పనులకు ఇబ్బందులు పడ్డామన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రైతులతో కలిసి మంత్రి ఆనం దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే స్పందించిన మంత్రి ఆనం చెరువు కట్ట అభివృద్ధికి ఆదేశాలు ఇచ్చారన్నారు. చెరువు కట్ట పనులు దాదాపు పూర్తి కావస్తున్నాయన్నారు. నిరంతరం పనులను పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. దాంతో తలుపురుపాడు రైతులు హర్షం వ్యక్తం చేశారు.

మున్సిపల్ స్కూల్లో యోగా శిక్షణ

ప్రజాశక్తి-కావలి : అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా కావలి పుర పాలక సంఘ ఉన్నత పాఠశాల పాతూరులో ఎన్‌సిసి అధికారి షేక్.మస్తాన్ వలీ ఆధ్వర్యంలో యోగా గురువు గోపాల్ శిక్షణలో ఎన్‌సిసి క్యాడెట్లకు యోగ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ శిక్షణ కార్యక్రమములో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుజాత పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతిరోజు యోగా ప్రాక్టీస్ చేయడం వల్ల మానసికంగా, శారీరకంగా, ఆరోగ్యంగా, ఉత్సాహంగా ఉంటారని ఏకాగ్రత, క్రమశిక్షణ వృద్ధి చెందుతాయని తెలియజేశారు.

తహశీల్దార్ బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి-బిట్రగుంట : బోగోలు మండల తహశీల్దారుగా బుధవారం సానా శ్రీనివాసులు రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా బోగోలు మండలంలో తహశీల్దారుగా పనిచేస్తున్న మలిశెట్టి సురేష్ బాబు కొండాపురంకు బదిలీ కావడంతో బోగోలు తహశీల్దారుగా సానా శ్రీనివాసులు రెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. కార్యాలయ సిబ్బంది స్వాగతం పలికారు.

రూ.20వేలు ఆర్థికసాయం

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : నిత్యాన్నదాత, సాంఘిక ఛారిటబుల్ ట్రస్టు అధినేత కంచి పరమేశ్వరరెడ్డి జనీవర ఆత్మకూరు మున్సిపల్ పరిధిలో కుటుంబ సభ్యులను కోల్పోయిన వారి కుటుంబాలకు రూ.20వేలు ఆర్థిక సహాయం అందజేశారు. మున్సిపల్ పరిధిలోని 7వ వార్డుకు చెందిన షేక్.మహబూబ్ బాషా, 21వ వార్డుకు చెందిన యాకసిరి పోలమ్మలు ఇటీవల మృతి చెందారు. దాంతో ఆ కుటుంబ సభ్యులకు ఒక్కొక్కరికి రూ.10వేల వంతున ఆయన మొత్తం రూ.20వేలు ఆర్థిక సహాయం అందజేశారు. బిజెపి నాయకులు కడుముల సుధాకర్ రెడ్డి, ట్రస్టు సభ్యులు శేషారెడ్డి, రాంపల్లి ప్రసాద్‌రెడ్డి, మెప్మా ఆర్‌పి సుప్ప తదితరులున్నారు.

21న సచివాలయాల్లో 'యోగాంధ్ర'

ప్రజాశక్తి-కోవూరు : మండలంలోని అన్ని సచివాలయాల్లో 21వ తేదీ యోగాంధ్ర కార్యక్రమం తప్పనిసరిగా చేపట్టాలని ఎంపిడిఒ శ్రీహరిరెడ్డి అన్నారు. ఎంపిడిఓ కార్యాలయంలో బుధవారం మండలంలోని పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఏ సచివాలయంలోనైనా యోగాంధ్ర రిజిస్ట్రేషన్ పెండింగ్‌లో ఉంటే వాటిని యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఇఒఆర్‌డి పాను పాల్గొన్నారు.

వైభవంగా కళ్యాణోత్సవం

ప్రజాశక్తి-దుత్తలూరు : నర్రవాడలో వెంగమాంబ బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. కార్యక్రమంలో భాగంగా నాలుగవ రోజు వెంగమాంబ గురవయ్య నాయుడు కళ్యాణం కన్నుల పండుగగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేశ్ అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడు కుమార్తె దీపావెంకట్, మాజీ ఎంఎల్‌ఏ కంభం విజయరామిరెడ్డి, కాకర్ల వెంకట్, మల్లంపాటి గురవయ్య నాయుడు, తదితరులు అమ్మవారికి పూజలు చేశారు.

వెలుగు ఎపిఎంగా ప్రవంతి బాధ్యతలు

ప్రజాశక్తి-ఉదయగిరి : నూతనంగా వెలుగు ఎపిఎంగా సారా ప్రవంతి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ పొదుపు సంఘ బంధాలు, సభ్యులు, సిసిలు ప్రభుత్వ నిర్దేశించిన లక్ష్యాలను రికవరీలను సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. అనంతరం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. సిసిలు సిబ్బంది ఆమెకు పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు.

ఎరువుల వాడకంపై అవగాహన

ప్రజాశక్తి-ఉదయగిరి : సేంద్రియ ఎరువులపై రైతులు మొగ్గు చూపాలని మండల ఇన్‌ఛార్జ్ వ్యవసాయ శాఖ అధికారి పి.విజయ భాస్కర్ కోరారు. ఈ సందర్భంగా బుధవారం మండల పరిధిలోని గండిపాలెం, కొండాయపాలెం రైతు సేవా కేంద్రాల్లో ఆయన పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎఇఒ వినోద్, విఎఎలు ఎస్.కె రహంతుల్లా, ఫయాజ్, శ్రీలత, రైతులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులపై తనిఖీ

ప్రజాశక్తి-కొడవలూరు : కొడవలూరు మండలం ఎంపిడిఒ వెంకట సుబ్బారావు బుధవారం మానేగుంటపాడు పంచాయతీలోని ఎస్టి కాలనీలో పారిశుధ్య పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడున్న గిరిజనులతో మాట్లాడి సమస్యల గురించి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల అందరికీ అందుతున్నాయా లేదా అని ఆరా తీసి తెలుసుకున్నారు. స్థానిక పంచాయతీ కార్యదర్శి సురేష్ ను సైడ్ కాలువలను శుభ్రపరచాలని ఆదేశించారు.

మాజీ ఎంఎల్ఏ 'కంభం'ను కలిసిన చల్ల ప్రసాద్

ప్రజాశక్తి-దుత్తలూరు : ఉదయగిరి మాజీ శాసన సభ్యులు, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కంభం విజయరామిరెడ్డిని నియోజకవర్గ తెలుగు యువత అధికార ప్రతినిధి చల్ల ప్రసాద్ మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తన రాజకీయ గురువు ఉదయగిరి నియోజకవర్గ అభివృద్ధి ప్రదాత అయిన తమ గురువును నెల్లూరులోని ఆయన స్వగృహంలో మర్యాద పూర్వకంగా కలిసి దుత్తలూరు మండల రాజకీయ అంశాలపై చర్చించారు. అనంతరం కంభం విజయ రామిరెడ్డి దంపతుల చిత్రపటాన్ని బహూకరించారు.

రేషన్ షాపులకు రెన్యూవల్ తప్పనిసరి

ప్రజాశక్తి-కోవూరు : మండలంలోని అన్ని రేషన్ దుకాణాలు తప్పనిసరిగా తమ లైసెన్సులను రెన్యూవల్ చేసుకోవాలని, ఈ విషయంలో నిర్లక్ష్యం వద్దని తహశీల్దార్ సిహెచ్ సుబ్బయ్య పేర్కొన్నారు. కోవూరులోని తహశీల్దార్ కార్యాలయంలో బుధవారం మండలంలోని అన్ని గ్రామాలకు సంబంధించిన రేషన్ డీలర్లతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ జబీర్, జిల్లా రేషన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జీవీ కృష్ణారెడ్డి, డీలర్లు ఉన్నారు.

ఎవరి కోసం ఈ భూ సేకరణ సర్వేలు.?

- తక్షణమే తేల్చాలని దళితుల నిరసన

ప్రజాశక్తి-దగదర్తి

విమానాశ్రయం భూసేకరణ సర్వేలు ఎవరి కోసం చేస్తున్నారంటూ పరిహారాన్ని భూస్వాములకు కట్టబెట్టేందుకా.. లేదా.. భుక్తి కోసం భూమిని సాగు చేసుకుని భూమినే నమ్ముకున్న నిరుపేదల కోసమా.. అనే విషయాన్ని తక్షణమే తేల్చాలంటూ బుధవారం దామవరం గ్రామానికి చెందిన దళితులు సర్వే జరుపుతున్న ప్రాంతంలో తమ నిరసన గళాన్ని విప్పారు. దామవరం గ్రామ సర్వేనెంబర్ వన్ బై వన్‌లో 700 ఎకరాలను 1952 సంవత్సరంలో అప్పటి ఉమ్మడి మద్రాసు ప్రభుత్వం గ్రామంలోని పశువుల మేత కోసం గ్రామంలో ఉండే ఎద్దుల సంఖ్య ఆధారంగా అప్పట్లో భూమిని కేటాయించారు. తదనంతరం సదరు భూములను గ్రామస్తులు తమకు హక్కు లేకపోయినా మరొకరికి అమ్మకాలు.. కొనుగోళ్లు .. జరిపారు. గ్రామంలోని కొంతమంది మాత్రం ఎవరికీ ఈ అమ్మకాలు జరపక సదరు భూములను వారే సాగు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. ప్రస్తుతం రెవెన్యూ అధికారులు జరుపుతున్న సర్వేలో పరిహారం ఎవరికి కట్టబెడతారు అనే విషయాన్ని తేల్చాలని పట్టుబడుతుండడం గమనార్హం. వీసబడిదారులకే పరిహారం ఇస్తారా.. లేదా.. అనుభవదారులకు ఇస్తారా.. లేదా.. కొనుగోలు జరిపిన వారికి ఇస్తారా.. ప్రభుత్వ భూమిలో సాగులో ఉన్న తమలాంటి పేదలకు పరిహారం గురించి ఎవరు ప్రస్తావించడం లేదని, దానిపై ఏదో ఒకటి తేల్చాల్సిందిగా తమకు భరోసా ఇవ్వాల్సిందిగా వారు కోరుతున్నారు. ప్రస్తుతం వన్ బై వన్ సర్వే నంబర్‌లో

ఆవేదనను వ్యక్తం చేస్తున్న దళితరైతులు

వీసబడిదారులు కాక, కొనుగోలుదారులు కాక నిరుపేదలు కొంతమంది భూమిని నమ్ముకుని సాగు చేసుకుంటూ జీవితం గడుపుతున్నామని చెబుతుండటం గమనార్హం. ఇప్పటికే ఈ విషయమై స్థానిక శాసనసభ్యులు దగ్గుబాటి వెంకటకృష్ణారెడ్డిని కలిసి తమ గోడు వెల్లబోసుకున్నామని దానికి స్పందించిన ఎంఎల్‌ఎ అనుభవంలో ఉన్న నిరుపేదలైన వారికి నూటికి నూరుశాతం న్యాయం జరిగే విధంగా తాను చర్యలు తీసుకుంటానని ఈ విషయమై ముఖ్యమంత్రితో చర్చిస్తానని భరోసా ఇచ్చినట్లు వారు చెబుతున్నారు. కానీ సర్వే చేస్తున్న అధికారులు మాత్రం సర్వే చేసేందుకు ఉన్న కారణాలు మాత్రం చెప్పడం లేదని పరిహారం గురించి తమకు ఎవరు ఇస్తారని ఈ విషయంలో జిల్లా ఉన్నతాధికారులు ప్రజా ప్రతినిధులు స్పందించి న్యాయం చేయాలని కోరుతుండడం గమనార్హం.

ఈ విషయమై తహశీల్దార్ పి.కృష్ణను వివరణ కోరగా.. కావలి ఆర్‌డిఒ వంశీకృష్ణ ఆదేశాల మేరకు మాత్రమే వారు బయట మండలాల నుండి కేటాయించిన సిబ్బందితో సర్వే కొనసాగిస్తున్నామన్నారు. ఇప్పటికే వన్ బై వన్ సర్వే నంబర్ 700 ఎకరాలకు సంబంధించి వీసబడిదారుల జాబితా తమ వద్ద ఉందని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అమ్మకాలు కొనుగోలు జరిపి ఉన్నట్లయితే వారి వివరాలు ప్రస్తుతం అనుభవంలో ఉన్న వారి వివరాలు సమగ్రంగా సర్వే నిర్వహించిన అనంతరం సదరు నివేదికలను ఉన్నతాధికారులకు పంపడం జరుగుతుందన్నారు. ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు తాము సర్వే జరుపుతున్నామే కానీ పరిహారం ఎవరికి ఇస్తారన్న విషయంలో తమకు స్పష్టమైన ఆదేశాలు లేవని, ఈ విషయమై మాట్లాడేందుకు తమ వద్ద సమాచారం ఏమీ లేదన్నారు. జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, ఆర్‌డిఒ వారి ఆదేశాల ప్రకారం మాత్రమే తాము నడుచుకుంటామని వారి నుండి ఆదేశాలు అందిన వెంటనే పరిహారం ఎవరికివాలో ప్రకటిస్తామన్నారు. ప్రస్తుతం దామవరం గ్రామంలో నెంబర్ వన్ బై వన్ 700 ఎకరాల విస్తీర్ణం కలిగి ఉందని ఇందులో ఏడు భాగాలు ఉండగా నాలుగు టీములకు ఈ బాధ్యతలను అప్పగించడం జరిగిందని, మూడు టీములకు ఒక్కొక్క టీముకు రెండు భాగాలు చొప్పున ఒక టీముకు ఒక భాగం చొప్పున అంటే 100 ఎకరాలు చొప్పున కేటాయించడం జరిగిందన్నారు. గ్రామంలోని కొంతమంది తమ భూములను కాక భూస్వాముల భూములను ముందు సర్వే చేస్తున్నారంటూ ప్రచారం చేస్తున్నట్లుగా తమ దృష్టికి వచ్చిందని 700 ఎకరాలను నాలుగు టీములు పూర్తిగా సర్వే చేసినా అనంతరం మాత్రమే ఉన్నత అధికారులకు నివేదిక పంపడం జరుగుతుందని సదరు భూముల్లో అనుభవంలో ఉన్న నిరుపేదలు సంయమనం పాటించాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో సాగుబడి చేస్తున్న రైతులు పాల్గొన్నారు.

'తల్లికి వందనం'కు తప్పని కష్టాలు

- ఓ తల్లి ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి-ఉదయగిరి

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తల్లికి వందనం కార్యక్రమం చేపట్టి ఇంట్లో ఎంతమంది చదివే పిల్లలు ఉన్నా.. తల్లి ఖాతాలో నగదు జమ చేస్తామని భరోసా ఇచ్చిన కూటమి ప్రభుత్వం వివిధ కారణాలతో తల్లి ఖాతాలో నగదు జమ కాక తప్పని తిప్పలుగా మారాయి. పట్టణంలోని షబ్బీర్ కాలనీ చెందిన జాబీన్ మహిళ భర్త మరణించి నలుగురు పిల్లలతో జీవనం సాగిస్తుండగా వారి కుటుంబంలో ఉద్యోగి ఉన్నట్టు హౌస్ ఓల్డ్ మ్యాప్ చూపించడంతో నలుగురు పిల్లలకు రావాల్సిన తల్లి దీవెన నగదు రాకపోవడంతో ఆమె తీవ్ర మనస్థాపానికిలోనై ఆత్మహత్య ప్రయత్నం చేయగా స్థానికులు సమాచారంతో టిడిపి నాయకులు సహాయంతో శాసనసభ్యులు కాకర్ల సురేష్‌కు సమాచారం అందించడంతో తక్షణమే శాసనసభ్యులు ఆమె కుటుంబాన్ని సందర్శించి ఓదార్చి ప్రభుత్వం నుండి రావాల్సిన తల్లికి దీవెన నగదు కచ్చితంగా అందుతుందని ఆమెకి భరోసా ఇచ్చి ఎంపిడిఒ అప్పాజీకి వెంటనే వారి పిల్లలకు రావాల్సిన నగదను అందేలా చేయాలని ఆదేశించారు. అనంతరం ఆమె కుటుంబ పరిస్థితులను తెలుసుకొని ఆమెకు రూ.50వేల నగదు శాసనసభ్యులు అందజేశారు.

"టార్గెట్లే తల్లుల కొంపలను ముంచాయి.."

సచివాలయ సిబ్బందికి టార్గెట్‌లు ఇచ్చి సర్వేలను చేయించడంతో సిబ్బంది తప్పిదాలతో తల్లుల కుటుంబాలలో ఇతరుల భూములు పెన్షనర్లు నమోదు చేయడంతో హౌస్ హెూల్డర్ మ్యాపింగ్‌లో కుటుంబ సభ్యులుగా వారు చేరడంతో కూటమి ప్రభుత్వం అందించాల్సిన తల్లికి వందనం నగదు తల్లి ఖాతాలో జమ కాకపోవడంతో పలువురు అధికారుల తీరును విమర్శిస్తున్నారు. ఎంతోఆశగా ఎదురు చూస్తున్న తల్లులకు మొండి చెయ్యి ఎదురవడంపై ఈ విషయంపై తొలగింపు ఆక్షన్ వచ్చినప్పుడే సమస్య పరిష్కారం అవుతుందని సచివాలయ సిబ్బంది చేతులెత్తేయడంపై పలు విమర్శలకు దారి తీస్తుంది. మండలంలో 12 సచివాలయాలు పరిధిలో అధికమంది హౌస్ ఓల్డ్ మ్యాప్‌లో రిటైర్డ్ పెన్షనర్లు ఎప్పుడు తొలగి సొంత రేషన్ కార్డు కలిగిన హౌస్ ఓల్డ్ మ్యాపింగ్‌లో ఉద్యోగులు నమోదు కావడంతో తల్లులకు రావాల్సిన నగదు రాకపోవడంతో తల్లులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. ఇలాగే 300 యూనిట్లు విద్యుత్ కాల్చిన నాలుగు చక్రాల వాహనం భూమి కలిగి ఉన్నట్లు లబ్ధిదారుల తల్లుల జాబితాలో చూపుతోందని కొన్నిటికి మాత్రమే పరిష్కారంకు అర్జీలను పెట్టుకోవచ్చని సచివాలయ సిబ్బంది సమాధానం ఇస్తున్నారు. ప్రధానమైన సమస్య గత 12 సంవత్సరాలుగా ఎదురుపడని సమస్య కూటమి ప్రభుత్వంలో హౌస్ ఓల్డ్ మ్యాపింగ్ పేరుతో పెళ్లి అయిన తర్వాత విడిపోయి ఇప్పుడు వారిని మ్యాపింగ్ పేరుతో ఆ కుటుంబంలో చూపుతూ తల్లులకు రావాల్సిన తల్లికి వందనం దూరం చేశారు. ఇచ్చిన గడువు ముగియ నుండడంతో తల్లులలో మరింత ఆవేదన అధికమవుతుంది జిల్లా కలెక్టర్ శాసనసభ్యులు కాకలా సురేష్ ప్రత్యేక చొరవ తీసుకొని అర్హులైన తల్లులకు రావాల్సిన నగదు వచ్చేందుకు సంబంధిత అధికారులతో చర్చించి హౌస్ వరల్డ్ మ్యాప్ లో వారిని తొలగించేందుకు ఆప్షన్ తీసుకువచ్చి అర్హులైన తల్లులందరికీ కూటమి ప్రభుత్వం అందిస్తున్న తల్లికి వందనం నగదను అందించాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

బాధితురాలిని పరామర్శిస్తున్న ఎంఎల్ఎ సురేష్

భవన సంక్షేమ బోర్డుకు నిధులు కేటాయించాలి

ప్రజాశక్తి-అనంతసాగరం

భవననిర్మాణ కార్మిక సంఘం (సిఐటియు) అనంతసాగరం జనరల్ బాడీ సమావేశం యుటిఎఫ్ కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశానికి హాజరైన మండల కార్యదర్శి అన్వర్‌బాషా మాట్లాడుతూ భవననిర్మాణ కార్మికులు అనేక సమస్యలతో బాధపడుతున్నారన్నారు. భవన నిర్మాణ సంక్షేమ బోర్డుకు నిధులు కేటాయించాలని జూలై 9వ తేదీన జరిగే సార్వత్రిక సమ్మెలో భవన నిర్మాణ కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలన్నారు. సమావేశంలో జన విజ్ఞాన వేదిక నాయకులు వేము పెంచలయ్య పాల్గొన్నారు. అనంతరం 15మందితో భవన నిర్మాణ కార్మిక సంఘం మండల కమిటీని ఏర్పాటు చేశారు. భవన నిర్మాణ కార్మిక సంఘం సిఐటియు అధ్యక్షులుగా ఎస్‌కె రహంతుల్లా, ప్రధాన కార్యదర్శిగా మీరా మొహిద్దీన్ ఉపాధ్యక్షులుగా ఇండ్ల గురవయ్య, సర్దార్ సహాయ కార్యదర్శులుగా రసూల్, ఖాజా మొయిద్దీన్‌లను ఏకగ్రీవంగా కమిటీ సభ్యులు ఎన్నుకున్నారు.

అనారోగ్యంతో ఆశా వర్కర్ మృతి

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం

బుచ్చిరెడ్డిపాలెం నగర పంచాయతీ పరిధిలోని శాంతినగర్‌కు చెందిన ఆశా వర్కర్ తిరువీధుల రమణమ్మ(53) 8 సంవత్సరాలుగా ఆశా వర్కర్‌గా విధులు నిర్వహిస్తూ గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం మృతి చెందింది. ఈ విషయం తెలుసుకున్న ఆశా వర్కర్ల జిల్లా కార్యదర్శి దుగ్గిరాల అన్నపూర్ణమ్మ, సిఐటియు మండల కార్యదర్శి చల్ల కొలుసు మల్లికార్జున, సిపిఎం పట్టణ కార్యదర్శి పోతంశెట్టి శ్రీనివాసులు, ఆశా వర్కర్లు వారి కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

ఈ-కెవైసి తప్పనిసరి

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : రాష్ట్ర ప్రభుత్వం అందజేయనున్న అన్నదాత సుఖీభవ - పిఎం కిసాన్ పథకానికి అర్హులైన రైతులు తప్పనిసరిగా ఈ-కెవైసి నమోదు చేసుకోవాలని ఆత్మకూరు సహాయ వ్యవసాయ సంచాలకులు వి.దేవసేనమ్మ పేర్కొన్నారు. మండలంలోని పేరారెడ్డిపల్లి గ్రామంలో బుధవారం వ్యవసాయాధికారికి కె.కిషోర్ బాబు ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎఇఒ కె.పోలయ్య, ఎంపిఇఒ షేక్.ఖాజానవాజ్, ఎంఎంసి సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులకు సంక్షేమ పథకాలు కొనసాగించాలి

ప్రజాశక్తి-కావలి

మున్సిపల్ కార్మికులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించాలని సిఐటియు రాష్ట్ర పిలుపుమేరకు అనుబంధ ఎ.పి. మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) ఆధ్వర్యంలో బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం కమిషనర్ జి.శ్రావణ్ కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు పట్టణ కార్యదర్శి వై.కృష్ణమోహన్ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులు చాలీచాలని జీతాలతో పనులు చేస్తుంటారని, వీరి పిల్లలకు "తల్లికి వందనం" డబ్బులు పడలేదన్నారు. కార్మికులందరినీ ప్రభుత్వ ఉద్యోగులుగా చూపించి, సంక్షేమ పథకాలకు కోత పెట్టడం చాలా అన్యాయమన్నారు. మున్సిపల్ కార్మికులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అన్నింటినీ కొనసాగించాలని ముఖ్యమంత్రి ఎన్నికల వాగ్దానంలో రూ.25 వేల లోపు వేతనాలు ఉన్న వారందరి సంక్షేమ పథకాలు అందిస్తామని చెప్పారన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత మున్సిపల్ కార్మికులకు సంక్షేమ పథకాలలో కోత పెట్టడం విడ్డూరంగా ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలప్పుడు ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయాలని, తల్లికి వందనం డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలా జరగని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు బాబు, శినయ్య, పోలయ్య, బిడదల మహేష్ మహిళా నాయకులు పల్లెపాటి అనిత, అలేఖ్య, తదితర కార్మికులు పాల్గొన్నారు.

కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలి

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని ఎఎస్‌పేట క్రాస్ రోడ్డు వద్ద ప్రమాదాల నివారణకు దానిని బ్లాక్ స్పాట్‌గా గుర్తించి ప్రమాదాల నివారణకు తక్షణ చర్యలు చేపట్టాలని డాక్టర్ బిఎస్ఆర్ హాస్పిటల్ ఎడ్యుకేషనల్ కమిటీ చైర్మన్ బొమ్మిరెడ్డి తారక్‌నాథ్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ట్రస్టు సభ్యుల ద్వారా వినతి పత్రాన్ని ఎస్పై జిలానీకి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెల్లూరు - ముంబయి జాతీయ రహదారిపై పోలీసులు, జాతీయ రహదారి ఇంజనీరింగ్ అధికారులు, కమ్యూనిటీ సంస్థలతో అత్యవసర సమావేశం ఏర్పాటు చేయాలని, ట్రాఫిక్ హెచ్చరిక ఇచ్చేందుకు క్లిష్టమైన ప్రదేశాలలో పెద్ద స్పష్టమైన హెచ్చరిక సంకేతాలను ఏర్పాటు చేయాలన్నారు. ఈ ప్రాంతంలో రోడ్డు భద్రతను మెరుగుపరిచేందుకు, ప్రాణరక్షణకు ఏమైన సహాయ సహకారాలకు తమ వంతు మద్దతు ఇస్తామని తెలిపారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఎమ్‌డి సాదిక్‌హుస్సేన్, షరీఫ్, మల్లికార్జున యాదవ్, భార్గవ రెడ్డి, షారుక్, జయ కృష్ణ, సల్మా, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డును పరిశీలిస్తున్న అధికారులు

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి సూచనల మేరకు బుధవారం ఉదయం నేషనల్ హైవే అథారిటీ, పోలీసు, రెవెన్యూ, ఆర్‌అండ్‌బి అధికారులు సంయుక్తంగా ఈ రహదారిని పరిశీలించారు. ఇటీవల జరిగిన ప్రమాదాల తీరుతెన్నులను విశ్లేషించారు. ప్రమాదాలకు గల కారణాలను గుర్తించి ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన భద్రతా చర్యలపై చర్చించారు. ఈ మేరకు నేషనల్ హైవే అథారిటీ ప్రాజెక్ట్ డైరెక్టర్ కెపి చౌదరి మాట్లాడుతూ మంత్రి సూచనల మేరకు ఈ రహదారిని పరిశీలించినట్లు తెలిపారు. మితిమీరిన వేగం, ఓవర్ లోడ్ కారణంగానే ప్రమాదాలు జరుగుతున్నట్లు నిర్ధారించినట్లు తెలిపారు. ఈ మేరకు అన్ని శాఖల సమన్వయంతో వాహనదారులకు అతివేగం, అధిక లోడ్ నివారించేలా అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని, అవసరమైన సూచిక బోర్డులు, రహదారిపై పెయింటింగ్ ఏర్పాటు చేస్తామని ఈ సందర్భంగా ప్రాజెక్ట్ డైరెక్టర్ తెలిపారు. భవిష్యత్తులో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా అప్రమత్తంగా అన్నిచర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఆత్మకూరు ఆర్‌డిఒ పావని, ఆర్ అండ్ బి ఎస్ఇ గంగాధర్, జిల్లా రవాణా శాఖ అధికారి చందర్, పంచాయతీరాజ్ ఈఈ మురళీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి-మర్రిపాడు

నెల్లూరు - ముంబై జాతీయ రహదారి పై పొంగూరు కండ్రిక సమీపంలో రోడ్డు ప్రమాదం జరిగింది. మోటార్ బైక్‌పై ఆత్మకూరు వెళ్తుండగా అదుపు తప్పి రోడ్డుపై పడ్డారు. బైక్ నడుపుతున్న వ్యక్తికి తీవ్ర గాయాలు కాగా డిసిపల్లి టోల్ ప్లాజా అంబులెన్సులో చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. గాయపడ్డ వ్యక్తి లింగసముద్రంకు చెందిన సుధాకర్‌గా పోలీసులు గుర్తించారు.

తహశీల్దారును కలిసిన జనసేన నాయకులు

ప్రజాశక్తి-ఎంఎస్‌పేట

నూతన తహశీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన కె.అనిల్ కుమార్‌ను మండలంలోని జనసేన నేతలు బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మండలంలోని రైతుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని నాయకులు తహశీల్దార్‌కు విన్నవించారు. కార్యక్రమంలో జనసేన మండల కన్వీనర్ సయ్యద్ అక్బర్ బాషా, మండల జనసేన నాయకులు ప్రవీణ్, ఖాజా నవాజ్, సిరాజ్, వలి జాన్, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

సాగునీరు విడుదల

ప్రజాశక్తి-అనంతసాగరం

సోమశిల జలాశయం నుండి రెండో పంటకు నీటిని ప్రాజెక్ట్ చైర్మన్ వేలూరు కేశవ చౌదరి విడుదల చేశారు. సోమశిల జలాశయం నుంచి రైతులకు రెండో పంటకు అవసరమైన నీటిని విడుదల చేయటంతో కలువాయి చెరువు వద్దకు నీటి ప్రవాహం చేరింది. ఈ ప్రవాహాన్ని సోమశిల ప్రాజెక్ట్ చైర్మన్ స్వయంగా పరిశీలించారు. రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి ఎకరాకు సాగు నీరు అందిస్తామని తెలిపారు.

ఇరిగేషన్ ఇఇగా ఎం.రవి

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

ఆత్మకూరు ఇరిగేషన్ ఈఈగా ఎం.రవి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఒంగోలు నుండి ఆత్మకూరుకు బదిలీ అయిన ఆయన బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇరిగేషన్ శాఖ పరిధిలో రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. గతంలో ఆయన ఆత్మకూరు ఇరిగేషన్ కార్యాలయంలో డీఈగా విధులు నిర్వహించారు.

అధికారులతో ఎంపిడిఒ సమీక్ష

ప్రజాశక్తి-అనంతసాగరం

మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఐహెచ్‌హెచ్ఎల్ ప్రోగ్రెస్, ఓడిఎఫ్ ప్లస్ మోడల్ విలేజస్‌పై ఎంపిడిఒ పి.ఐజాక్ ప్రవీణ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆర్డబ్ల్యూఎస్ ఎఇ, డిడబ్ల్యూఎస్ కన్సల్టెంట్, హౌసింగ్ ఎఇ, స్వచ్ఛభారత్ ఎంఆర్‌సి, ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు సూచనలు సలహాలు ఇచ్చారు.

ఉపాధి హామీ పథకంపై సమీక్ష

ప్రజాశక్తి-అనంతసాగరం

మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంపై ఎంపిడిఒ పి.ఐజాక్‌ప్రవీణ్ సమీక్ష నిర్వహించారు. హౌసింగ్, ఐహెచ్‌హెచ్‌ఎల్‌కు సంబంధించి హౌసింగ్ ఎఇ, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమీక్ష నిర్వహించారు. ఇ.సి., టి.ఎ, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ

ప్రజాశక్తి-ఎంఎస్‌పేట

మండలానికి మొదటి విడతగా 50శాతం రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు సరఫరా చేస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి ఎం.సురేష్ బాబు మండలంలోని రైతులందరికీ తెలియజేశారు. ఆధార్ కార్డు, పొలం పాస్ పుస్తకం, ఓటిపి కోసం ఆధార్‌తో లింక్ అయినా మొబైల్ ఫోను తీసుకొని వెళ్లి తమ వివరాలను నమోదు చేసుకొని, అమౌంట్‌ను చెల్లిస్తే ఎపి సీడ్స్, నెల్లూరు వారి నుండి సీడ్స్ తెప్పించి రైతులకు పంపిణీ చేస్తామని తెలియజేశారు.

ప్రజాశక్తి-కొడవలూరు : సబ్సిడీపై పచ్చిరొట్టె విత్తనాలు పిల్లి పెసర, జీలుగ, జనుములు రైతులకు అందుబాటులో ఉన్నాయనీ వ్యవసాయ అధికారిని విజయలక్ష్మి తెలిపారు. ఆమె బుధవారం నార్త్ రాజుపాలెం పంచాయతీ రైతు సేవ కేంద్రాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయ విస్తరణ అధికారి వెంకట్రావు, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ శివజ్ఞాన, విఆర్ఓ మల్లికార్జున పాల్గొన్నారు.

ఆలయంలో చోరీ

ప్రజాశక్తి-వరికుంటపాడు

విరువూరు గ్రామంలోని శ్రీ విజయ గణపతి, పోలేరమ్మ, చెంగాలమ్మ దేవస్థానంలో మంగళవారం అర్ధరాత్రి గేటు తాళాలు పగలగొట్టి లోపలికి ప్రవేశించి ఉండిని పగలగొట్టి అందులోని నగదును తీసుకొని హుండీలను అక్కడే వదిలేసి పారిపోయారు. పలుమార్లు అదే దేవస్థానంపై చోరీ జరగడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

చేతి పంపు బోరుకు మరమ్మతులు చేపట్టాలి

ప్రజాశక్తి-మర్రిపాడు

మండలంలోని రామానాయుడు పల్లిలో కొన్ని నెలల నుండి మరమ్మతులకు నోచుకోని బోరును అలానే విడిచి పెట్టడంతో గ్రామస్థులు నీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామాల్లో తాగునీటి శుద్ధి జల కేంద్రాలు ఉన్నా.. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు వాడుకలకు చేతి పంపుల నీటిపై ఆధారపడడం తప్పదు. బోర్లకు మరమ్మతులు చేపట్టక పోవడంతో పరిస్థితి దారుణంగా ఉంది. సమస్యను పలుమార్లు పంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకు వెళ్లినా స్పందించ లేదని గ్రామస్థులు ఆరోపించారు. అధికారులు స్పందించి చేతి పంపునకు మరమ్మతులు చేపట్టాలని గ్రామస్తులు కోరారు.



బస్టాండ్ స్టాల్స్‌లో అధిక ధరలు

ప్రజాశక్తి-కావలి

కావలి ఎపిఎస్. ఆర్.టి.సి. బస్టాండ్‌లోని స్టాల్స్‌లో అధిక ధరలకు వాటర్, ఇతర వస్తువులు అమ్ముతున్నారని, ప్రయాణికులను దోచుకుంటున్నారని, సతీష్ అనే ప్రయాణికుడు బుధవారం కావలి ఆర్.టి.సి. ఇన్‌ఛార్జి డిపో మేనేజర్ రావూరి శ్రీనివాసులుకు ఫిర్యాదు చేశారు. బస్సు దిగి, దాహంగా ఉండి, వాటర్ బాటిల్ కొంటె 1/2 లీటర్ బాటిల్ రూ.10 ధర కాగా, రూ.15 వసూలు చేశారన్నారు. తనతో పాటు మరో వ్యక్తి 1 లీ వాటర్ బాటిల్ కొంటె రూ.20 ధరకు బదులుగా రూ.25 వసూలు చేశారని డి.ఎం.కు ఫిర్యాదు చేశారు. బస్టాండ్‌లో ఎద్దైనా తినుబండారాలు కొంటె కూడా బయట కన్నా ఎక్కువ ధరలకు అమ్ముతున్నారని, అలాంటివారిపై చర్యలు చేపట్టాలని సతీష్ డిమాండ్ చేశారు.

IN THE COURT OF THE PRINCIPAL CIVIL JUDGE (SENIOR DIVISION) : Nellore

(Testamentary and Intestate Jurisdiction)

Succession O.P.No. 55 / 2025

1. SOMANCHY ALIVELU
2. SOMANCHI KAMESWAR RAU
3. SOMANCHI KAMAKSHI SUNDARI
4. SOMANCHI VENKATA RAMANA MURTHY - Petitioners

Vs

Nil - Respondents

జనరల్ నోటీసు

(గౌరవ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడమేమనగా పై పిటిషన్‌లో 1 నుండి 4 పిటిషనరులకు తండ్రి గారైన **SOMANCHI SOMAYAJULU** S/o **Dakshana Murthy** గారు తే11-12-2004 ది ఎలాంటి వ్రాతమూలక ఏర్పాట్లు చేయకుండా మరణించినందున ఆయన పేరిట ఉన్న **SHARES / BONDS / INVESTMENTS / CLAIMS** తమ పేరిట బదులాయించుటకు పై పిటిషనర్లను వారసులుగా గుర్తించి succession సర్టిఫికేట్ మంజూరు చేయమని కోరుతూ పై **S.O.P.No. 55 / 2025** దాఖలు చేసియున్నందున ఎవరికైనా ఎలాంటి ఆక్షేపణలు ఉన్నయెడల అటువంటి వారు తే11-07-2025 ది ఉదయం 10.30 గంటలకు స్వయముగా గానీ, ప్లీడరు ద్వారా గానీ, లేదా మీ తరపున చెప్పగలిగినవారి ద్వారా గానీ హాజరై మీకు గల ఆక్షేపణలు తెలియచేసుకోవలసినది. లేనియెడల ఎలాంటి అభ్యంతరములు లేనట్లుగా భావించి కేసును పరోక్షమున తీర్మానించబడును.

SCHEDULE

Schedule of debts and securities and monies set forth in Schedule onnexed consequent to death of (Late) **SOMANCHI SOMAYAJULU,** S/o **DAKSHANA MURTHY,** Nellore Payable to The Petitioners.

Sl. No.	Name of The Company	Certificate No.	Distinctive No (s).	Total No. of Shares	Total amount Rs.-PS
1.	Crompton Greaves Consumer Electricals Limited	**Folio No.CGC0128214 vide Certificate No.128124**	626688076 to 626693955	5880	Rs.58,800-00
2.	CG Power and Industrial Solutions Limited	**Folio No.0012719 vide Certificate No.000901871**	368482997 to 368485516	2520	Rs.25,200-00
3.	CG Power and Industrial Solutions Limited	**Folio No.0012719 vide Certificate No.000870885**	2368286 to 2370685	2400	Rs.24,000-00
4.	CG Power and Industrial Solutions Limited	**Folio No.0012719 vide Certificate No.000887095**	365295346 to 365296305	960	Rs.9,600-00
5.	Equity shares issued by Hindustan Composites Ltd., (erstwhile **Hindustan Ferodo Limited)**	**Certificate No. No.0022917**	4005053 to 4005072	20	Rs. 200-00
6.	Equity shares issued by Hindustan Composites Ltd., (erstwhile **Hindustan Ferodo Limited)**	**Certificate No. No.4092**	2045864 to 2045913	50	Rs. 500-00
7.	Equity shares issued by Hindustan Composites Ltd., (erstwhile **Hindustan Ferodo Limited)**	**Certificate No. 5697, Date of Transfer 22-07-1965 vide tranfer No.54 bearing register Folio No. S/634**	2121514 to 2121563	50	Rs. 500-00
8.	Equity shares issued by Hindustan Composites Ltd., (erstwhile **Hindustan Ferodo Limited)**	**Certificate No. 4682, Date of Transfer 22-07-1965 vide tranfer No.53 bearing register Folio No. S/634**	205294 to 2052973	50	Rs. 500-00

షేక్.ఆరిఫ్ మాలిక్, కామిల మాలిక్ పఠాన్

పిటిషనర్లతరపు న్యాయవాదులు, నెల్లూరు.